క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల వితరణ



సహచర విద్యార్థి సూర్యనారాయణకు సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : అనారోగ్యంతో బాధపడుతున్న సహచర విద్యార్థి సూర్యనారాయణకు తమవంతు సాయం అందించి ఉదారత చాటుకున్నారు పూర్వ విద్యార్థులు. ఒంపోలు గ్రామానికి చెందిన 1997–98 బ్యాచ్ విద్యార్థి జెర్రిపోతుల సూర్యనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అతనిని ఆదుకునేందుకు అతని సహచర పూర్వ విద్యార్థులు రూ.40వేల మేర విరాళాలు సేకరించి అందజేశారు. వారికి సూర్యనారాయణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న కాలనీలో ఇంటింటి కుళాయి పనులు



జగనన్న కాలనీలో మంచినీటి సదుపాయానికి చర్యలు ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీకి మంచినీటి సదుపాయం కల్పించడంలో భాగంగా ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి పూర్తి స్థాయిలో తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సచివాలయ కన్వీనర్ గంగాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గంగాదేవిపేటలో మందులు అందజేస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. మూలపేట శివారు గంగాదేవిపేటలో గురువారం నిర్వహించిన 104 సేవలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా కళ్లజోళ్లు అందజేశారు. ఆరోగ్యాధికారి యామిని వైద్య పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం రమణి, హెల్త్ అసిస్టెంట్ విశ్వనాథం, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో 30 మందికి జరిమానా



పాములవాకలో కారు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమణయ్య

కోటవురట్ల : పాములవాక జంక్షన్‌లో ఎస్‌ఐ రమణయ్య సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 30 మందికి అపరాధ రుసుము విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే వారు నిబంధనలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని కోరారు. వాహనచోదకులు హెల్మెట్ ధారణ, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మంచి నడతను కలిగి ఉండాలని కోరారు.

పోటా పోటీగా ఆడుదాం-ఆంధ్ర



వాలీబాల్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



వాలీబాల్ విజేత మడుతూరు క్రీడాకారులతో ప్రజా ప్రతినిధులు



మునగపాక హైస్కూల్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పాయకరావుపేట : ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీలు పట్టణంలో ముమ్మరంగా సాగుతున్నాయి. మండల స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో గల 24 గ్రామాలకుగాను 24 జట్లు ఆటల్లో పాల్గొన్నాయి.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

మునగపాక : మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు తరలివచ్చారు. నాగవరం, సిరసపల్లి మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టు నియోజకవర్గ స్థాయికి ఎంపికవుతుందని నిర్వాహకులు తెలిపారు.

కొరుప్రోలులో ఖోఖో పోటీలు

ఎస్.రాయవరం : మండలంలో ఆడుదాం ఆంధ్రా... మండల స్థాయి క్రీడలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాల ఖోఖో, టెన్నీ కాయిట్ నిర్వహించగా, తిమ్మాపురం వేద ఆకాడమి కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడా పోటీలను ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులు, పీఈటీలు, పీడీ పర్యవేక్షించారు.

వాలీబాల్ విజేత మడుతూరు

అచ్యుతాపురం : ఆడుదాం-ఆంధ్రాలో భాగంగా అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల విజేతగా మడుతూరు జట్టు నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్‌లో మడుతూరు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కూండ్రపు విమలనాయుడు, చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను,భాను వెంకట్,అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త కంబాల జోగులును సత్కరిస్తున్న నాయకులు



మేడిశెట్టి సూర్యారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే మనందరం ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సమన్వయకర్త కంబాల జోగులుకు గ్రామాల్లో నాయకుల పరిచయ కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయి. గురువారం ఎస్.నర్సాపురం, కుమారపురం, రాజగోపాలపురం గ్రామాల్లో పార్టీ నాయకులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వీరిరువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకోసం అందరం రానున్న ఎన్నికల్లో కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా సరే రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లను, ఎంపీటీసీలను, నాయకులను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరిచయం చేశారు. రాజగోపాలపురం గ్రామంలో దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి గొల్ల బాబూరావు, కంబాల జోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేశవరం మాజీ సర్పంచ్ మేడిశెట్టి సూర్యారావు ఈ మధ్యకాలంలో స్వర్గస్థులైనందున ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీ తాతారావు, పాల్మన్‌పేట, కేశవరం, రాజగోపాలపురం సర్పంచ్‌లు కోటేశ్వరరావు, రామగోవిందు, లోవరెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యజ్జల అన్నవరం పాల్గొన్నారు.

జోరుగా రబీ వరి నాట్లు



సర్వసిద్ధి ప్రాంతంలో రబీనాట్లు వేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండలంలో జోరుగా రబీ వరినాట్లు వేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవక సర్వసిద్ధి, సైతారుపేట, పేటసూదిపురం, ఉప్పరాపల్లి గ్రామాల్లో నాట్లు వేయలేదు. ఇటీవల మైచాంగ్ తుపాను కారణంగా మండలంలో భారీ వర్షాలు కురిసి, వరహానది ఉప్పొంగిన సంగతి తెలిసిందే. నదిలో నీరు, కాలువల ప్రవాహంతో రబీనాట్లక్కు సిద్ధమయ్యారు. నారుపోసి ప్రస్తుతం నాట్లుకు సిద్ధమయ్యారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 3 వందల ఎకరాల వరకు నాట్లు వేస్తామని చెబుతున్నారు. మండలంలో ఖరీఫ్ నాట్లు తప్ప, రబీ సాగు చేయని రైతులకు ఇది సాహసమే అని చెబుతున్నారు. రబీలో తేలికపాటి రకం (120 రోజులు)సాగు చేస్తున్నప్పటికీ ఖర్చులు అధికంగా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి

యలమంచిలి రూరల్ : ప్రతి ఒక్కరూ చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ. సాయికుమారి అన్నారు. గురువారం యలమంచిలి రైల్వేస్టేషన్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలకార్మికుల పునరావాస వారోత్సవాల్లో భాగంగా జరిగిన న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాలకార్మిక చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదవారు, వయోవృద్ధులు, మహిళలకు న్యాయ సహాయం అందించడమే లీగల్ సెల్ అథారిటీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు పౌరులంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్‌ఐ కె. పాపినాయుడు, ఏజీపీ డి.వెంకట్రావు, యలమంచిలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఆకుల సురేష్ కుమార్, డ్యూటీ స్టేషన్ మాస్టర్ పి. అశోక్, లోక్ అదాలత్ సభ్యుడు రమణ, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య చర్యలు



కె.వెంకటాపురంలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల : పారిశుధ్య మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవాని కోరారు. కె.వెంకటాపురంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలలో పూడికలు తీసి, వీధులను శుభ్రపరిచారు. మురుగుగుంతలపై బ్లీచింగ్ చల్లారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాంబిల్లి : మామిడివాడ రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఎ. గ్రేడు ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ 2203, సాధారణ రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ. 2183కు కొనుగోలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త జీవీవీ రమణమూర్తిరాజు(శ్రీనుబాబు), సర్పంచ్ అప్పలనర్స, ఏవో సుమంత, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్యాసిరావు, సత్యన్నారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన మార్గశిర మాసోత్సవాలు



మార్గశిరమాసం చివరిరోజు అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



కనకమహాలక్ష్మి అమ్మవారు

ఎస్.రాయవరం : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మాసోత్సవాలు గురువారంతో ముగిసాయి. కర్రివానిపాలెం గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద అయిదు వారాలుగా గురువారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి వారాంతపు అన్న సమారాధన నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో...

యలమంచిలి రూరల్ : ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈ ఏడాది మార్గశిర మాసోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. మార్గశిరం అమావాస్య సందర్భంగా గురువారం అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అమ్మవారి మూలవిరాట్‌కు మహిళా భక్తులు అభిషేకాలు చేసి, పసుపు, కుంకుమలు సమర్పించి హారతులిచ్చారు. ఆలయ అర్చకులు కోటి పంతులు భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేశారు. నెల రోజుల పాటు ధర్మవరం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తుల పూజలతో కిక్కిరిసిపోయింది. ఈ నెల 19న అమ్మవారి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలి



మత్స్యకారులతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక : వేట సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ కోరారు. గురువారం సాయంత్రం ఆవలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చేపల వేటకు వెళ్లేటపుడు మత్స్యకారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యాటకులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు, ఎస్‌ఐ మహమ్మద్ అలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



కనకమహాలక్ష్మి అమ్మ వారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నాయకులు

కశింకోట : మండలంలోని బయ్యవరంలో కనక మహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, వార్డు సభ్యులు గొన్నా నార్ని శ్రీనివాసరావు, గొల్లవిల్లి బాబూరావు, గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పంచదార్లలో అక్రమంగా కంకర తవ్వకాలు



పంచదార్లలో అనుమతులు లేకుండా కంకర తవ్వకాలు, తరలింపు దృశ్యం

రాంబిల్లి : పంచదార్లలో గురువారం అక్రమంగా కంకర తవ్వకాలు చేపట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా పొక్లెయిన్‌తో కంకర తవ్వకాలు చేసి ట్రాక్టర్లలో తరలించారు. దీనిపై స్థానికులు కొందరు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసు సిబ్బంది వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న కంకర తవ్వకందారులు పొక్లెయిన్, ట్రాక్టర్లను తరలించేశారు. ఆ తర్వాత పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అప్పటికే వాహనాలు మాయమయ్యాయని స్థానికులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ పి. భాగ్యవతిని వివరణ కోరగా పంచదార్ల వద్ద కంకర తవ్వకాలకు తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

‘ఆవ’లో జాగ్రత్త సుమా...



మత్స్యకారులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం : కొండకర్ల-వాడ్రాపల్లి ఆవలో చేపట్టే బోటు రవాణాతో పాటు, చేపలను పట్టే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సూచించారు. గురువారం కొండకర్ల ఆవ ఒడ్డున స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. ఆవలో బోటు నడిపే మత్స్యకారులు, పూలు, చేపల కోసం ఆవలో బోటులో వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొండకర్ల ఆవ పరిధిలో ఉన్న ప్రైవేట్ రిసార్టులను డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు పరిశీలించి తగిన సూచనలు జారీ చేశారు. సీఐ బుచ్చిరాజు, మునగపాక ఎస్‌ఐ మహ్మద్ అలీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పత్రాల అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు బీమా పత్రాలు అందిస్తున్న సునీత, జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి : వైఎస్సార్ బీమా బాధితులకు అండగా నిలుస్తుందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు అన్నారు. వారి స్వగృహంలో గురువారం స్థానిక జయరామరాజుపేటకు బాధిత కుటుంబ సభ్యులకు రూ.90 వేల బీమా సొమ్ము పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుమాసాల క్రితం బొండాడ నూకరాజు దురదృష్టవశాత్తు మరణించడంతో ఆ సమయంలో రూ.10 వేలు అందించగా మిగిలిన సొమ్ము పత్రాన్ని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పలకా సత్యనారాయణ, పార్టీ శ్రేణులు ఆడారి శ్రీనివాసరావు, కోన ఉమ, డొంక సత్తిబాబు, పేరూరి కల్యాణ్, చింతా రాంజీ, మృతుడి తల్లి రమణమ్మ, తమ్ముడు శ్రీను పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవ కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వర మహోత్సవ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు చెప్పారు. ఆలయ ఆవరణలో గురువారం ఉత్సవ కరపత్ర ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, జాజుల రమేష్ దంపతులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు కార్పొరేటర్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నరసింగరావు, కోశాధికారి వేల్పుల గణేష్, శంకర్ల పద్మ, వీధిపెద్దలు మద్దాల కూర్మారావు, మద్దాల రమణబాబు, నల్లల రాజు, ముమ్మిన సూరిబాబు, బొండా శంకరరావు, ఉగ్గిన అప్పారావు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రోగి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు

రోలుగుంట: ఆరోగ్య గ్రామాలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది. గ్రామస్థాయిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య నిపుణలతో ఉచితంగా ఖరీదైన రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వైద్యం చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోంది. ఇటీవల మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి, ఈ నెల 5వ తేదీ నుంచి రెండో విడత కార్యక్రమాలను చేపట్టింది. ఈ శిబిరంలో 160 మంది రోగులకుపైగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సమ్మె విరమించి విధుల్లోకి సీఆర్పీలు



విధుల్లోకి చేరుతున్నట్లుగా ఎంఈవోలకు రిపోర్టు ఇస్తున్న సీఆర్పీలు, ఇతర సిబ్బంది



రిజిస్టర్‌లో సంతకాలు చేసి విధుల్లోకి చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నాతవరం: సీఆర్పీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించి విధుల్లోకి చేరారని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ అన్నారు. గురువారం మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవోకు సీఆర్పీలు, ఇతర ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం ఎంఈవో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నేటి నుంచి విద్యా శాఖకు సంబంధించి పనులన్నీ యధావిధిగా జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గ్రహించి నాడు – నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తమ సమస్యలపై స్పందించినందుకు సీఆర్పీల యూనియన్ మండలాధ్యక్షుడు పోలుపర్తి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. తమ డిమాండ్లను నిబంధనల ప్రకారం దశల వారీగా పరిష్కరించేందుకు అంగీకారం తెలిపారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో -2 కామిరెడ్డి వరహాల బాబు, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించిన సమగ్ర శిక్ష ఉద్యోగుల చర్చలు

రోలుగుంట: అధికారులు, మంత్రులతో చర్చలు సఫలం కావడంతో సర్వశిక్ష ఉద్యోగులు తమ సమ్మె విరమించుకుని గురువారం విధుల్లో చేరారు. వీరి సమస్యలపై యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గత నెల 20న ఆందోళన చేపట్టి విధులు బహిష్కరించారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి మూర్తి

నాతవరం: గ్రామ పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కావలసిన వనరులపై శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేయాలని పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలో శాఖల వారీగా ప్రణాళిక తయారు చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సమగ్ర సమాచారం నివేదిక ద్వారా పంచాయతీలకు సకాలంలో అందించాలన్నారు. అనంతరం కార్యదర్శులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, జేఈలు రాజేష్, వెంకటేశ్వరమ్మ, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, ఉపాధి ఏపీవో చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మునగపాక జనసేన అధ్యక్షునిగా పరశురామ్

మునగపాక : జనసేన మునగపాక మండల పార్టీ అధ్యక్షునిగా టెక్కలి పరశురామ్ నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువార ఉత్తర్వులు అందాయి. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న పరశురామ్‌ను అధిష్టానం గుర్తించి మండల పార్టీ అధ్యక్షునిగా నియమించారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ అన్నారు.